సీఈఓ ఆధ్వర్యంలో ఆసుపత్రిలో తనిఖీ

కంటోన్మెంట్: అనుమతుల్లేని, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న ఆసుపత్రులపై బోర్డు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. బోర్డు సివిలియన్ నామినేటెడ్ సభ్యుడు రామకృష్ణ లేఖతో ఏకంగా బోర్డు సీఈఓ మధుకర్‌నాయక్, కంటోన్మెంట్ చీఫ్ ప్లానర్ ఫణీకుమార్‌తో కలిసి బోయిన్‌పల్లిలోని వీఆర్ ఆసుపత్రిలో మంగళవారం తనిఖీలు చేపట్టారు. ఆసుపత్రి, భవనం నిర్మాణాల అనుమతులు, ట్రేడ్ లైసెన్స్ సహా ట్యాక్స్ వివరాలను బుధవారంలోగా బోర్డు కార్యాలయంలో అందించాలని నిర్వాహకులను ఆదేశించారు. ఇటీవల కడుపునొప్పితో ఆసుపత్రిలో చేరిన ఓ వ్యక్తి మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సదరు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో ఇప్పటికే వైద్యారోగ్య శాఖ అధికారులు, పోలీసులు చర్యలు చేపట్టారు. ఇదిలాఉంటే బోర్డు అధికారులు చేపట్టిన అంతర్గత తనిఖీల్లో పదుల సంఖ్యలో నిబంధనలకు విరుద్ధంగా ఆసుపత్రులు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. త్వరలోనే వాటిపై కూడా చర్యలు తీసుకుంటామని బోర్డు అధికారులు పేర్కొంటున్నారు. కాగా వీఆర్ ఆసుపత్రిలో ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకే, కమిటీ వేయాలని బోర్డు సీఈఓకు లేఖ రాశానని బోర్డు సభ్యుడు రామకృష్ణ తెలిపారు. వీఆర్ ఆసుపత్రితో పాటు కంటోన్మెంట్ వ్యాప్తంగా దవాఖానల్లోనూ తనిఖీలు నిర్వహిస్తారని లోపభూయిష్టంగా ఉంటే సరిదిద్దుకునే అవకాశం ఇస్తామని లేకుంటే చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

హనుమాన్ ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం



అడ్డగుట్ట: తుకారాంగేట్‌లోని పహాడీ హనుమాన్ ఆలయ నూతన కమిటీ సభ్యులు మంగళవారం ఆలయ ప్రాంగణంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఎండోమెంట్ సికింద్రాబాద్ ఇన్‌స్పెక్టర్ ఆండాలు, ఈవో రవీకాంత్ శర్మ సమక్షంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌గా మేకల లక్ష్మణ్ ప్రసాద్, సభ్యులుగా ఎల్. మూర్తి, విష్ణు ప్రకాశ్, విఠల్‌రావు, సంతోష్‌కుమార్, లలిత్ కుమార్, విజయలక్ష్మిని నియమించారు. ఈ సందర్భంగా ఎక్స్‌అఫీషియో మెంబర్, ఆలయ అర్చకులు భాష్యం వెంకటరమణచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు, శేష వస్త్రాలు నూతన కమిటీ సభ్యులకు అందజేశారు. అనంతరం, చైర్మన్ లక్ష్మణ్ ప్రసాద్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధే లక్ష్యంగా కమిటీ పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గంట రాజుసాగర్, కృష్ణారావు, మహేశ్, లక్ష్మి, సులోచన, చంద్రకళ, కొమరమ్మ, నర్సమ్మ, అమీర్, జాఫర్, ఆలయ సిబ్బంది సైదులు, విజయకుమార్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు. ఇదిలాఉంటే తుకారాంగేట్‌లోని ప్రసిద్ధిగాంచిన పహాడీ హనుమాన్ ఆలయానికి పదేళ్లుగా కమిటీ వేయలేదని దీంతో ఆలయం అభివృద్ధి చెందలేదని స్థానికులు పేర్కొంటున్నారు. నూతన కమిటీ హయాంలోనైనా ఆలయానికి మరమ్మతులు, సౌకర్యాలు కల్పించాలని వారు కోరుతున్నారు.

శ్మశానవాటిక వరకు సీసీ రోడ్డు వేయాలి

కంటోన్మెంట్: బోయిన్‌పల్లిలోని జీఎం అంజయ్య స్మారక హిందూ శ్మశాన వాటికకు వెళ్లేందుకు సీసీ రోడ్డు వేయాలని బోర్డు మాజీ సభ్యుడు కోరారు. ఈ మేరకు బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జే. మహేశ్వర్ రెడ్డి, ఆరో వార్డు మాజీ సభ్యుడు పాండుయాదవ్‌తో కలిసి బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్మశాన వాటికకు వెళ్లే దారి గుంతలమయంగా మారి ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇక్కడ సీసీ రోడ్డు వేసేందుకు 2018లోనే అంచనాలు సిద్ధం చేసినట్లు గుర్తు చేశారు. త్వరలోనే రోడ్డు పనులకు బోర్డు అనుమతులు జారీ చేస్తానని సీఈఓ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.



సీఈఓ మధుకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న బోర్డు మాజీ సభ్యులు

ఓయూలో మాదిగ విద్యార్థుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై కాంగ్రెస్ అనుకూల మాదిగ విద్యార్థి నాయకులు సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంగళవారం సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘం నాయకుడు వలిగొండ నరసింహ మాట్లాడుతూ 30 ఏండ్లుగా రగులుతున్న వర్గీకరణ అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి పరిష్కరించి తెలంగాణ చరిత్రలో నిలిచారని కొనియాడారు. వర్గీకరణకు సహకరించిన మంత్రి దామోదర రాజనరసింహ, ఎమ్మెల్యే వేముల వీరేశంకు ఓయూ నేతలు వేల్పుల సంజయ్, కొత్తపల్లి తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీకాంత్, తాళ్ల అజయ్, రాములు, అర్జున్, పార్థు, సందీప్, శివ, సంతోష్, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం

సనత్‌నగర్: సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని ఇందుకు ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వే నిదర్శమని సీనియర్ కాంగ్రెస్ నేత విశాల్ సూదం అన్నారు. కుల గణన ప్రకారం 56.33 శాతంగా బీసీలు ఉన్నట్లు తేల్చడంపై కాంగ్రెస్ ఆధ్వర్యంలో బేగంపేట ఓల్డ్‌కస్టమ్స్ బస్తీలో తెలంగాణ జాతి పరిశీలన ఫలితాల ఉత్సవాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీ లెక్కలు తేలడంతో ఇక వారికి అందాల్సిన ఫలాలు మరింతగా అందుతాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో రమేశ్, హనీఫ్, తస్లీం, మునీర్, అడ్డూ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో విశాల్ సూదం తదితరులు

కొనసాగుతున్న ఈఎస్ఐ ఉద్యోగుల ఆందోళనలు



ఆందోళన చేస్తున్న ఈఎస్ఐ ఉద్యోగులు

పద్మారావునగర్: సికింద్రాబాద్ గాంధీ ప్రభుత్వాసుపత్రి ఎదుట బీమా వైద్య సేవల(ఈఎస్ఐ) ఉద్యోగులు చేపట్టిన ఆందోళనలు కొనసాగుతున్నాయి. మంగళవారం భోజన విరామ సమయంలో డైరెక్టరేట్ కార్యాలయం ఎదుట ఉద్యోగులు, సిబ్బంది ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టీఎన్జీవో డీఐఎంఎస్ యూనిట్ వ్యవస్థాపక అధ్యక్షుడు వీరన్న గౌడ్ మాట్లాడుతూ.. ఈఎస్ఐని ప్రత్యేక కార్పొరేషన్ చేయాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులతో చర్చించకుండా, అభిప్రాయాలు తెలుసుకోకుండా ప్రత్యేక కార్పొరేషన్ చేయాలని నిర్ణయించడం తగదన్నారు. దీనిపై ఉద్యోగులు ఎంత మాత్రం సంసిద్ధంగా లేరన్నారు. రానున్నరోజుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

ఇంజినీరింగ్ కాలేజీల్లో విద్యా ప్రమాణాలు పెంచండి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని ప్రైవేట్ ఇంజినీరింగ్ కాలేజీల్లో విద్యా ప్రమాణాలు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల నుంచి లక్షల్లో ఫీజులు వసులు చేసిన అధ్యాపకులు, లైబ్రరీలు, కంప్యూటర్ ల్యాబ్‌లు, ప్రయోగశాలలు, వర్క్‌షాపులు, క్రీడా మైదానాలతో పాటు ఇతర మౌలిక వసతులు సక్రమంగా ఉండడం లేదని పేర్కొన్నారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలితో పాటు విజిలెన్స్, విద్యాశాఖల అధికారులు ఆయా కాలేజీల్లో తనిఖీలు చేపట్టిన నాణ్యతా ప్రమాణాలు పాటించని కాలేజీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, రవిందర్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జాజుల లింగంగౌడ్

ప్రధాని మోదీ చిత్రపటాలకు పాలాభిషేకం



సీతాఫల్‌మండిలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నేతలు



వారాసిగూడ చౌరస్తాలో ..

సికింద్రాబాద్: బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఈ.వి. నరేశ్ ఆధ్వర్యంలో సీతాఫల్‌మండి చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్‌లో ఏడాదికి రూ. 12 లక్షల వరకు ఆదాయం ఉన్న వారికి పన్ను మినహాయింపు ఇవ్వడంతో ఎంతో మందికి మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మేకల సారంగపాణి, కనకట్ల హరి, భాస్కర్ గిరి, అజయ్, యాదగిరి, గణేశ్, సంపత్, సురేశ్, మురళి, సతీశ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

వారాసిగూడ చౌరస్తాలో..

బౌద్ధనగర్: డివిజన్ అధ్యక్షుడు సాయి ప్రసాద్‌గౌడ్ ఆధ్వర్యంలో వారాసిగూడ చౌరస్తాలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవిప్రసాద్ గౌడ్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నేతి సత్యానారాయణ, దత్తు, చైతన్య, సంపత్, సుబ్బారావు, ఓములు, నర్సింగ్‌రావు, ఆగుల్ల శ్రీను, సురేశ్, బాలయ్య, జయంత్ పాల్గొన్నారు.

కేన్సర్‌పై విద్యార్థులకు అవగాహన

సనత్‌నగర్: ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డి గ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు కేన్సర్ పై అవగాహన కల్పించారు. కేన్సర్‌కు గల కారణా లు, నివారణ, చికిత్సను మోడల్ ఎగ్జిబిషన్ తదితర కార్యకలాపాల ద్వారా విద్యార్థులకు వివరించారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

సికింద్రాబాద్: రైలు ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ నుంచి చర్లపల్లి రైల్వే స్టేషన్ వెళ్లే మార్గం మధ్యలోని పట్టాలపై సోమవారం 25–30 ఏళ్ల యువకుడు యువకుడు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

సరైన ఉద్యోగం లేదని మనస్తాపం..

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య



శివ (ఫైల్)

అడ్డగుట్ట: సరైన ఉద్యోగం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ రఘుబాబు తెలిపిన వివరాల ప్రకారం.. లాలాపేటలోని వినోభానగర్‌కు చెందిన శివ (28) తల్లిదండ్రులతో ఉంటున్నాడు. అయితే శివకు సరైన ఉద్యోగం లేదని దీంతో తల్లిదండ్రులను బాగా చూసుకోలేకపోతున్నాననే మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇంటికి వచ్చిన తల్లిదండ్రులు తలుపు తట్టినా తీయకపోవడంతో కిటికీ నుంచి చూడగా ఉరేసుకొని కనిపించాడు. వెంటనే తలుపులు బద్దలుగొట్టి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గాంధీ మార్చురీకి తరలించారు. అయితే తల్లిదండ్రులను సరిగా చూసుకోలేకపోతున్నానని అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నట్లు సూసైడ్ నోట్‌లో రాశాడు. తన స్నేహితులే అంత్యక్రియలు చేయాలని అప్పుడే హ్యాపీగా ఫీల్ అవుతానని అందులో పేర్కొన్నాడు.

చోరీ కేసు నిందితుడి అరెస్టు

రసూల్‌పురా: బంగారు ఆభరణాలు, నగదు దొంగిలించిన నిందితుడిని కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి సొత్తును స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు. సీఐ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇషాక్ కాలనీ మేఘనా ప్యారడైజ్ ప్లాట్‌నంబర్–10లో ఉండే కాంట్రాక్టర్ పి. సుందరం గతేడాది తమ ఇంటి మరమ్మతుల నేపథ్యంలో దానిని ఖాళీ చేసి గన్‌రాక్‌లో మరో ఇంటికి మారారు. ఆ సమయంలో బంగారు ఆభరణాలు, నగదు ఉన్న రెండు బీరువాలకు తాళం వేసి అక్కడే వదిలేశారు. కాగా కార్పెంటర్ పనుల కోసం బోరబండలో నివాసం ఉంటున్న ఉత్తరప్రదేశ్‌లోని మహరాజ్ గంజ్ కామాసింఖుర్ద్ ప్రాంతానికి చెందిన ఆదేశ్ గుప్తాకు పనులు అప్పగించారు. పనులు పూర్తి కాగా గత జనవరి 26న సుందరం కుటుంబ సభ్యులు తమ ఇంటికి తిరిగి వచ్చారు. అదేనెల 30న అల్మారాలు తెరిచి చూడగా అందులోని బంగారు ఆభరణాలు, నగదు కనిపించలేదు. దీంతో కార్పెంటర్ ఆదేశ్‌గుప్తాపై అనుమానం వ్యక్తం చేస్తూ కార్ఖాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏసీపీ రమేశ్ పర్యవేక్షణలో సీఐ రామకృష్ణ నేతృత్వంలో ఎస్ఐ రవికుమార్, కేసు దర్యాప్తు చేసి సాంకేతిక పరిజ్ఞానంతో దర్యాప్తు చేసి నాగోల్ బండ్లగూడలో గుప్తాను అరెస్టు చేశారు. నిందితుడి నుంచి రూ. 99 వేలతో పాటు రూ. 35 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

సూర్యభగవానుడి ఆలయంలో ప్రత్యేక పూజలు



ఎమ్మెల్యే శ్రీగణేశ్‌ను ఆశీర్వదిస్తున్న అర్చకులు



పూజల్లో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి

రసూల్‌పురా: రథసప్తమి పర్వదినం సందర్భంగా తిరుమలగిరిలోని సూర్య భగవానుడి ఆలయానికి మంగళవారం భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే భక్తులు క్యూలో నిల్చొని స్వామివారిని దర్శించుకున్నారు. కంటోన్మెంట్, మేడ్చల్ ఎమ్మెల్యేలు శ్రీగణేశ్, చామకూర మల్లారెడ్డి, కల్పన దంపతులు, రాష్ట్ర బెవరేజేస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గజ్జెల నగేశ్, బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్ తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎమ్మెల్యే మజ్జిగను పంపిణీ చేశారు. అర్చకులు ఎమ్మెల్యేను ఆశ్వీరదించి శాలువాతో సత్కరించారు. అదేవిధంగా భక్తుల కోసం ఏడో వార్డు జేఏసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే శ్రీగణేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మురళి ముదిరాజ్, తేలుకుంట సతీశ్, సంతోష్ యాదవ్, జేఏసీ నాయకులు బోస్, పి. నర్సింహ, వైవీరావు తదితరులు పాల్గొన్నారు.

బస్తీలకు వెలుగొచ్చే..

స్ట్రీట్ లైట్స్‌కు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..

లాలాపేట: తార్నాక డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో స్ట్రీట్ లైట్స్‌కు అధికారులు మంగళవారం మరమ్మతులు చేపట్టారు. వీధి లైట్లు వెలుగక 'అంధకారంలో బస్తీలు' పేరిట ఈనెల 3న 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. లాలాపేట సత్యానగర్, ఇందిరానగర్‌లో పని చేయని పలు స్ట్రీట్ లైట్స్‌కు మరమ్మతులు చేపట్టి లైట్లు వెలిగేలా చర్యలు తీసుకున్నారు. దాదాపు 10 రోజులుగా వీధి దీపాలు వెలగడం లేదని, సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' దినపత్రికకు ఇందిరానగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నేతికార్ మహేశ్, బస్తీ వాసులు కృతజ్ఞతలు తెలియజేశారు.



'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన కథనం



ఇందిరానగర్‌లో స్ట్రీట్ లైట్స్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం

విద్యార్థి బహిష్కరణను నిరసిస్తూ ధర్నా



ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘం నాయకులు

రాంగోపాల్‌పేట్: కళాశాల నుంచి దళిత విద్యార్థినిని బహిష్కరించారని నిరసిస్తూ బీఆర్ఎస్వీ సంఘం నాయకులు అవినాష్ కళాశాల ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దశరథ్ మాట్లాడుతూ.. ఇద్దరు విద్యార్థులు గొడవపడ్డారనే కారణంతో దళిత విద్యార్థినిని కాలేజీ యాజమాన్యం రోడ్డు మీద పడేసిందన్నారు. కాలేజీలో బౌన్సర్లను పెట్టి నడిపిస్తున్నారని ఇదో కొత్త సంస్కృతి అని మండిపడ్డారు. వెంటనే కళాశాల చైర్మన్‌ను అరెస్టు చేసి దళిత విద్యార్థికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు జంగయ్య, చంద్రకాంతి, నాగేందర్, అద్విత్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు. కాగా కళాశాల నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరించే విద్యార్థులపై కఠినంగా వ్యవహరిస్తామని కాలేజీ ప్రిన్సిపాల్ లహరి తెలిపారు. కాలేజీ ఫంక్షన్‌కు ఇద్దరు వ్యక్తులు కారణం కావడంతో పాటు బయటి వ్యక్తులను తీసుకుని వచ్చి ఇబ్బంది పెట్టారని వివరించారు. అయినా మానవతా దృక్పథంతో విద్యార్థులను పరీక్షలకు హాజరయ్యేలా చూస్తామని అయితే కళాశాలలో తరగతులకు అనుమతించమని పేర్కొన్నారు.

సీఎంకు ధన్యవాదాలు: గాలి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న ప్రొ. గాలి వినోద్‌కుమార్

లాలాపేట: ఎస్సీ వర్గీకరణ చేసినందుకు కోటి మంది దళితుల పక్షాన తెలంగాణ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు దక్షిణాది జాక్ చైర్మన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ పేర్కొన్నారు. తార్నాకలోని తన కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 30 ఏళ్ల దళితుల రిజర్వేషన్ల కొట్లాటకు ముగింపు పలుకుతూ దేశంలోనే తొలిసారిగా సామాజిక న్యాయాన్ని సంచార జాతులకు కూడా దక్కేలా చట్టం తీసుకురావడం అభినందనీయమన్నారు. ఈ విజయం ఏ ఒక్కరిది కాదని దళిత ప్రజల పోరాట ఫలితం అని పేర్కొన్నారు. దీనిని దళిత అమరవీరులకు అంకితం అని పేర్కొన్నారు.

రాష్ట్రంలో 60 శాతానికి పైగా బీసీ జనాభా



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో బీసీ కులాల జనాభా 60 శాతానికి పైగా ఉంటుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొల్లెపల్లి స్వామిగౌడ్ అన్నారు. ఓయూలో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే తప్పుల తడకగా ఉందన్నారు. గత ప్రభుత్వ హయంలో కేసీఆర్ చేపట్టిన కులగణనలో బీసీలు 52 శాతం ఉండగా, ప్రస్తుత రేవంత్ రెడ్డి సర్కార్‌లో 46 శాతానికి తగ్గించడం బీసీలను మోసగించడమే అని అన్నారు. అలాగే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో 7 శాతం గల ఓసీలు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో 15 శాతానికి పెంచడం విడ్డూరంగా ఉందన్నారు. కులగణనపై విచారణ జరిపించి బీసీలకు న్యాయం చేయాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఆకట్టుకున్న సంజన ప్లేస్కూల్ వార్షికోత్సవం

రాంగోపాల్‌పేట్: సంజన ప్లే స్కూల్ మారుతీ వీధి, మచ్చబొల్లారం స్కూళ్ల వార్షికోత్సవాన్ని సికింద్రాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. అలాగే నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. అనంతరం ప్రిన్సిపాల్ శారద, విజయ్‌కుమార్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి ప్రొఫెసర్ వెంకట్రావ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.



ప్రదర్శనల్లో విద్యార్థులు

ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ. 13, నల్లవంకాయ 23, పొడుగు వంకాయ 23, బెండకాయ 45, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 15, క్యాప్సికం 40, పచ్చకాకర 35, పందిరి బీర 35, క్యాబేజీ 11, క్యారెట్ 21, దొండ 28, గుండుబీన్స్ 50, గింజ చిక్కుడు 35, గోకరకాయ 40, కీర 23, దోసకాయ 21, బీట్‌రూట్ 21, ఉల్లిగడ్డ 30, ఆలుగడ్డ 23, చామగడ్డ 40, మొరంగడ్డ 31, కందగడ్డ 55, సొరకాయ 9, పొట్లకాయ 15, అరటికాయ 9, మునగకాయ 4–5, ముల్లంగి 4–5. ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

నియామకం



నియామక పత్రం అందుకుంటున్న సతీశ్‌కుమార్

లాలాపేట: నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) తెలంగాణ రాష్ట్ర పొలిటికల్, గవర్నెన్స్ వింగ్ అధ్యక్షుడిగా కాశీ సతీశ్‌కుమార్ నియామకమయ్యారు. ఈమేరకు ఎన్‌సీసీ వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ శ్యామ్ పాల్, తెలంగాణ అధ్యక్షుడు మద్దెల సంజయ్, తెలంగాణ జనరల్ సెక్రటరీ బక్క ఏలియా తదితరులు మంగళవారం నియామక పత్రాన్ని సతీశ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్ మాట్లాడుతూ.. క్రైస్తవుల సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

జర్నలిజంలో పీహెచ్‌డీ సీట్లను కల్పించండి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం డిపార్టుమెంట్‌లో పీహెచ్‌డీ సీట్లను కల్పించాలని విద్యార్థులు మంగళవారం డీన్, రిజిస్ట్రార్, హెడ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరేళ్లుగా వెలువడిన మూడు పీహెచ్‌డీ నోటిఫికేషన్లలో సీట్ల సంఖ్యను (0)గా చూపించారన్నారు. తాజాగా వెలువడిన పీహెచ్‌డీ నోటిఫికేషన్లలో సీట్లను కల్పించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరినట్లు వారు తెలిపారు. ఇచ్చినవారిలో పూసల రమేశ్, సుమంత్, రుక్మాత్‌పాష, మాదాసు రాహుల్ పేర్కొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



హర్యానా గవర్నర్ దత్తాత్రేయతో అశోక్‌యాదవ్

లాలాపేట: రాష్ట్ర గొర్రెల, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డా. కొమ్ము అశోక్ యాదవ్ ఇటీవల గ్లోబల్ అసోసియేషన్ జర్మనీ పీస్ యూనివర్సిటీ నుంచి సామాజిక సేవారంగంలో రెండో గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. దీంతో అశోక్‌యాదవ్ హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ అశోక్‌యాదవ్‌ను అభినందించారు. కార్యక్రమంలో యాదవ సంఘాల నాయకులు భేరి రామ్‌చందర్ యాదవ్, తిరుపతియాదవ్, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

సన్మానం



పవన్‌ఖేరాను సన్మానిస్తున్న బెంజిమిన్ దబ్బేటా

సనత్‌నగర్: దేశంలో న్యాయపూర్వకమైన ఎన్నికల నిర్వహణపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నేతృత్వంలో ఏర్పాటైన ఈగిల్ కమిటీ సభ్యుడిగా పవన్‌ఖేరా నియామకమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ క్లబ్ క్రికెటర్ బెంజిమిన్ దబ్బేటా మంగళవారం పవన్‌ఖేరాను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజాస్వామ్య విలువలు కాపాడేందుకు పవన్‌ఖేరా నిబద్ధతతో పని చేయాలని సూచించారు.

కలెక్టర్ కారును ఢీకొట్టిన మరో కారు

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డునెంబర్–12 నుంచి రోడ్డునెంబర్–13 వైపు కలెక్టర్ బంగ్లాకు వెళ్తున్న ఓ కలెక్టర్ అధికారిక వాహనాన్ని ఎదురుగా అదుపుతప్పి వేగంగా వచ్చిన ఓ కారు ఢీకొట్టిన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. బంజారాహిల్స్ రోడ్డునెంబర్–13లోని కలెక్టర్ బంగ్లాలో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉంటున్నారు. ఆయన డ్రైవర్ హేమంత్‌కుమార్ రోడ్డునెంబర్–12 నుంచి రోడ్డునెంబర్ –13 వరకు కలెక్టర్ కారులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మినీ కూపర్ కారు ఢీకొట్టింది. దీంతో కలెక్టర్ కారు ముందు భాగం దెబ్బతింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.